

సారూ.. ఆ ఇళ్లు మేము కట్టుకోలేం. అప్పులపాలు కాలేం.. అంటూ కొందరు లబ్ధిదారులు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదు. గత ప్రభుత్వాల హయాంలో యూనిట్ కాస్ట్‌కు కొంత చేతినుంచి డబ్బు పెడితే ఇల్లు పూర్తయ్యేది. ఇప్పుడు యూనిట్ కాస్ట్ తక్కువ కావడం.. రేట్లు పెరిగి పోవడంతో ఇంటి నిర్మాణానికి అప్పులపాలు కావాల్సి వస్తోంది. అందుకని చాలా మంది లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. ఇలా అస్సలు ప్రారంభంకాని 1500 ఇళ్లను రద్దు చేయాలని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపగా.. 1025 రద్దు చేస్తూ ఆదేశాలొచ్చాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



ఆ ఇళ్లు మేము కట్టుకోలేం

- నిర్మాణానికి ముందుకురాని లబ్ధిదారులు
- అనువుగా లేని లేఅవుట్లు, యూనిట్‌కాస్ట్ తక్కువ కావడమే కారణం
- తాజాగా 1025 ఇళ్లను రద్దు చేసిన ప్రభుత్వం
- పనులు చేపట్టి అప్పులపాలైన కొందరు లబ్ధిదారులు

గృహ నిర్మాణ పథకానికి గత ప్రభుత్వాల హయాంలో డిమాండు ఎక్కువగా ఉండేది. ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ లబ్ధిదారులు తిరిగి మరీ గృహాల్ని మంజూరు చేసుకునేవారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయానికి మరింత వేసుకుని ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకునేవారు. ఈ ప్రభుత్వంలో అధికారులే లబ్ధిదారులు చుట్టూ తిరుగుతున్నా ఇంటి నిర్మాణానికి వీరు ఆసక్తి చూపడం లేదు. ఎందుకంటే.. టీడీపీ హయాంలో ఇల్లు మంజూరైన లబ్ధిదారుడికి రూ.2.50 లక్షల యూనిట్ కాస్ట్ వచ్చేది. ఇందులో కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.లక్ష ఇచ్చేది. అప్పటి ధరలకు లబ్ధిదారుడు మరో రూ.లక్ష చేతి నుంచి వేసుకుంటే సొంతింటి కల నెరవేరేది. కరోనా తర్వాత నిర్మాణ సామగ్రి ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీనికి తోడు ఇంటి నిర్మాణానికి కేంద్రం ఇచ్చే రూ.1.5 లక్షలకు.. తన వాటాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇవ్వడం లేదు. దీంతో టీడీపీ హయాంతో పోలిస్తే యూనిట్ కాస్ట్ రూ.లక్ష తగ్గి.. రూ.1.5 లక్షలకు పరిమితమైంది. ఇలా యూనిట్ కాస్ట్ తగ్గి, ధరలు పెరగడంతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ఇప్పుడున్న ధరలకు 1.5 సెంట్లలో ఇంటి నిర్మాణానికి కనీసం రూ.6 లక్షలకుపైనే అవుతుందని అంచనా. ప్రభుత్వం ఇచ్చే రూ.1.5 లక్షలు పోను చేతినుంచి రూ.4.5 లక్షల వరకు పడుతుంది. పేదలు ఇంత మొత్తాన్ని వెచ్చించలేని పరిస్థితి. ఇంత అప్పుచేసి ఇల్లు కట్టుకుందామని భావించినా.. కాలనీ లేఅవుట్ ఊరికి దూరంగా, గుట్టల్లో.. ఎగుడు దిగుడు ప్రాంతాల్లో ఉండటంతో వెనకడుగు వేస్తున్నారు. మరోవైపు ఎలాగైనా లబ్ధిదారుల చేత పనులు చేపట్టాలంటూ అధికారులపై ఒత్తిడి పెరిగిపోయింది. ఈ క్రమంలో నాలుగేళ్ల కిందట అధికారులు జగనన్న లేఅవుట్లలో మెగా గ్రౌండింగ్ మేళా చేపట్టారు. లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో అధికారులే ఎక్స్‌కవేటర్లతో పునాది గుంతలను తవ్వించి గ్రౌండింగ్ అయినట్లు లెక్కల్లో చూపించుకున్నారు. ఫొటోలు అప్‌లోడ్ చేసుకున్నారు. పెద్దఎత్తున గ్రౌండింగ్ చేసినట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకునే క్రమంలో అధికారులకు లక్ష్యాలు ఇచ్చింది. దీంతో వారు ఇలా గుంతలు తవ్వేసి లెక్కలు రాసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఆపై కొందరు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ అప్పులు ఎలా తీర్చాలంటూ కొందరు అయోమయంలో పడ్డారు. మరికొందరు అప్పులు దొరక్క.. ఇళ్ల నిర్మాణాన్ని సగంలోనే నిలిపేశారు. అటు ఇల్లు పూర్తికాక.. ఇటు కొంతవరకు అప్పు కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం యూనిట్ కాస్ట్‌ను పెంచకపోవడంపై వీరంతా ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

అత్యధికంగా చిత్తూరులో రద్దు

ఇళ్ల నిర్మాణానికి పూర్తిగా ఆసక్తి చూపని 1500 మందికి చెందిన గృహాలను రద్దు చేయాలని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. వీటిని పరిశీలించి 1025 గృహాలను రద్దు చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. ఇందులో చిత్తూరులో 608, పూతలపట్టులో 228, పలమనేరులో 131, కుప్పంలో 31, నగరిలో 27 చొప్పున ఉన్నాయి.

పునాది దశ దాటినవాటికే బిల్లులు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టనివి రద్దు చేసినట్లు తెలుస్తోంది. పునాదులు తవ్వి వదిలేసిన వాటికి ఇప్పట్లో బిల్లులు మంజూరు చేయకుండా పెండింగులో పెట్టే అవకాశముంది. పునాది దశ దాటి పురోగతిలో ఉన్న నిర్మాణాలకు బిల్లులు వస్తాయని అధికారులు అంటున్నారు.

ఇదీ ఇళ్ల ప్రోగ్రెస్

వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాకు 73,584 పక్కా గృహాలు మంజూరయ్యాయి. వీటిలో 46,374 గృహాల నిర్మాణం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. నాలుగేళ్లవుతున్నా 3082 మంది లబ్ధిదారులు ఇంకా ఇంటి నిర్మాణాలను ప్రారంభించలేదు. మరో 3560 మంది పునాది గుంతలు తవ్వి వదిలేశారు. 10,948 మంది పునాదులను మాత్రమే నిర్మించుకుని, తదుపరి నిర్మాణాల జోలికి వెళ్లలేదు. 5,334 మంది గోడల్ని.. 4,286 మంది స్లాబును వేసుకున్నారు.



స్పాట్‌కు ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు

నేటి నుంచి టెన్త్ 'స్పాట్'


చిత్తూరు (సెంట్రల్), మార్చి 31: టెన్త్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి (స్పాట్) అవసరమైన ఏర్పాట్లను విద్యాశాఖ ఆదివారం పూర్తి చేసింది. చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియ కొనసాగనుంది. స్ట్రాంగ్ రూం, టేబుల్స్, లైట్లు, ఫ్యాన్లు, క్యాంటీన్, టాయిలెట్స్ తదితర వసతులు ఏర్పాటు చేశారు. స్పాట్ విధులకు 2131 మందిని కేటాయించారు. స్పాట్ క్యాంపు ఆఫీసర్‌గా డీఈవో దేవరాజు వ్యవహరించగా, సహాయ క్యాంపు అధికారులుగా డీవైఈవో చంద్రశేఖర్, స్ట్రాంగ్ రూం క్యాంపు అధికారిగా పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి వ్యవహరించనున్నారు. స్పాట్‌కు సంబంధించి 104 బ్యాచ్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో చీఫ్ ఎగ్జామినర్లు 111 మంది, సహాయ ఎగ్జామినర్లు 666, స్పెషల్ అసిస్టెంట్లు 221 మందిని నియమించారు. సబ్జెక్టుల వారీగా టీచర్లు ఆదివారం సాయంత్రం స్పాట్ కేంద్రంలో రిపోర్టు చేశారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జవాబు పత్రాల మూల్యాకనం ప్రక్రియ జరగనుంది. సోమవారం ఉదయం 8గంటల లోపు రిపోర్టు చేయని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఈవో తెలిపారు.



సబ్జెక్టు వారీగా రిపోర్టు చేస్తున్న టీచర్లు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం): సా. 6.30
సహరి (మంగళవారం): ఉ. 4.47

పలమనేరులో ఒంటరి ఏనుగు



శనివారం అర్ధరాత్రి జాతీయ రహదారిని దాటుతున్న ఏనుగు

పలమనేరు, మార్చి 31: పలమనేరులో శనివారం అర్ధరాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. సమీప అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగు.. పట్టణానికి ఆనుకుని ఉండే గంటావూరు వద్ద జాతీయ రహదారి దాటింది. ఆ సమయంలో జాతీయరహదారిపై వచ్చిన వాహనదారులు రోడ్డు దాటుతున్న ఏనుగును చూసి భయాందోళన చెందారు. దాదాపు 20 నిమిషాలపాటు ఒంటరి ఏనుగు రోడ్డు దాటలేక రోడ్డుపక్కనే నిల్చొని ఉండిపోయింది. అటుపిమ్మట ఒంటరి ఏనుగు తిన్నగా రోడ్డు దాటి అవతలి వైపు ఉన్న చెరువు గుండా గంగవరం అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది.

వీటికి కోడ్ వర్తించదా?



- శిలాఫలకంపై జగన్ ఫొటో

శ్రీరంగరాజపురం: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఎస్ఆర్‌పురం మండలం గంగమ్మగుడి గ్రామంలో ఆరిమాని గంగమ్మ దేవస్థానంలోని శిలాఫలకంపై ఉన్న సీఎం జగన్ ఫొటోకు ముసుగు వేలయలేదు. ఇలా వదిలేయడంపై ప్రతిపక్షాలు అభ్యంతరం చెబుతున్నాయి.



రంగు మార్చరా?

గుడిపాల: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం పక్కనే ఉన్న రైతు భరోసా కేంద్రం వైసీపీ రంగులతో దర్శనమిస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఇకనైనా రంగును తొలగించాలని విపక్షాలు డిమాండు చేస్తున్నాయి.

మద్యం మత్తులో యువకుల వీరంగం

- కారు హారన్ కొట్టడంపై ఆగ్రహిస్తూ ఎంపీటీసీపై వలంటీరు సహా ముగ్గురి దాడి
- పోలీసుల అదుపులో నిందితులు







పోలీస్ స్టేషన్ వద్ద గుమికూడిన సి.బండపల్లె గ్రామస్తులు - దాడిలో దెబ్బతిన్న కారు - పోలీసుల అదుపులో నిందితులు (మధ్యలో వ్యక్తి వలంటీరు)

శాంతిపురం, మార్చి 31: వలంటీరు సహా మద్యం మత్తులో ముగ్గురు యువకులు వీరంగం సృష్టించారు. రోడ్డుపై మద్యం తాగుతుండగా.. ఆ దారిన వస్తున్న కారు హారన్ కొట్టడంతో ఆగ్రహించారు. కారులోని ఎంపీటీసీ నామాలప్పపై దాడి చేశారు. ఆయన పోలీసు స్టేషన్‌కు పరుగుతీసి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈఘటన శాంతిపురం మండలంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం.. సి.బండపల్లెకు చెందిన ఎంపీటీసీ నామాలప్ప శనివారం రాత్రి వి.కోట నుంచి కారులో బయలుదేరారు. తన స్నేహితులను కొత్తపేట గ్రామంలో వదిలిపెట్టి అర్ధరాత్రి సమయంలో తన స్వగ్రామానికి రాళ్లబూదుగూరు గసికపల్లె రోడ్డులో వెళుతున్నారు. అదే సమయంలో రాళ్ళబూదుగూరు తిమ్మరాయస్వామి దేవాలయం సమీపంలో నడి రోడ్డుపైన నలుగురు యువకులు మద్యం తాగుతున్నారు. వారిని చూసి ఈయన హారన్ కొట్టారు. ఎందుకురా హారన్ కొడతావంటూ ఆ నలుగురిలో ముగ్గురు యువకులు కారుపై దాడి చేయడంతో అద్దం పగిలిపోయింది. ఎందుకు గొడవ చేస్తున్నారంటూ నామాలప్ప డోరు తీయగానే ఆ ముగ్గురు అతడిపై విచక్షణారహితంగా దాడి చేశారు. 'ఒంటిపైన గుడ్డలు చించేశారు. మెడలోని బంగారు చైను, ఉంగరాలు, కొంత నగదు లాక్కొన్నారు. అవిపోతే పోనీ నన్ను ప్రాణాలతో వదిలేయండి.. బిడ్డల గల వ్యక్తిని. మీ కాళ్లు పట్టుకుంటాను అని వేడుకున్నా. కనికరం లేకుండా దారుణంగా కొట్టారు. ఇంక చంపేస్తారని భయంతో కేకలు వేశా. ఆ అరుపులకు చుట్టుపక్కల ఉన్న వారు పరుగున అక్కడికి చేరుకుని ఆ యువకులను అడ్డుకున్నారు. ఇంతలో నేను కూతవేటు దూరంలో ఉన్న పోలీసు స్టేషనుకు చేరుకుని చేరుకుని జరిగిన విషయం చెప్పా. నేను ఇచ్చిన సమాచారంతో నా బంధువులు పోలీసు స్టేషనుకు చేరుకున్నారు' అంటూ నామాలప్ప వివరించారు. దాడిలో గాయపడిన అతడిని కుప్పంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దాడి జరిగిన ప్రదేశానికి పోలీసులు వెళ్లగా.. వీరిని చూసి ముగ్గురు పరారవగా ఒక యువకుడు దొరికాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆదివారం ఉదయం మిగిలిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన ముగ్గురిలో రాళ్లబూదుగూరుకు చెందిన పట్టాభి అలియాస్ పటాలి, వలంటీరు దిలీప్, రవి ఉన్నారు. నామాలప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.



గాయపడిన ఎంపీటీసీ నామాలప్ప

టీడీపీ నేతల పరామర్శ

కుప్పంలో చికిత్స పొందుతున్న ఎంపీటీసీ నామాలప్పను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, కాణిపాకం వెంకటేష్, శాంతిపురం మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జులు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పరామర్శించారు. అతడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

వైసీపీ అల్లరిమూకలూ జాగ్రత్త

- ఎంపీటీసీపై దాడిని ఖండించిన చంద్రబాబు

సి బండపల్లె ఎంపీటీసీ నామాలప్పపై జరిగిన దాడిని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఖండించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను ఆదివారం ఫోను ద్వారా మాట్లాడి పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శాంతి భద్రతలు దెబ్బతినే విధంగా వైసీపీ అల్లరి మూకలు ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇదే తంతు కొనసాగితే ఎన్నికల తర్వాత కుప్పం ప్రజలు వైసీపీ గూండాలను తరిమేస్తారన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. తనపై ముగ్గురు దాడికి పాల్పడ్డారని బాధితుడు చెబుతున్నా.. ఒక్కరినే పోలీసులు గుర్తించడం సరికాదన్నారు. వలంటీరుతో పాటు మిగతా వారిపైనా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

'కోడ్'ను పక్కన పెట్టి..!

- పాత బోర్డు సభ్యులచే సమావేశమా?

చిత్తూరు కల్చరల్, మార్చి 31: చిత్తూరు కోదండరామాలయంలో ఏప్రిల్ 11 నుంచి నిర్వహించే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి.. పాత బోర్డుతో సమావేశం నిర్వహించడం విమర్శలకు తావిచ్చింది. అధికార పార్టీకి చెందిన పాత పాలక వర్గంతో కలిసి అధికారులు ఆదివారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నప్పుడు అధికారులే సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అలాకాకుండా రాజకీయ జోక్యంతో శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించడం పట్ల ఆరోపణలు వస్తున్నాయి.



ఈవో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న పాత బోర్డు సభ్యులు

సెలవు రోజైనా పనిచేసిన బ్యాంకులు, ఎల్‌ఐసీ కార్యాలయాలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 31: ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు.. మార్చి 31వ తేది ఆదివారం అయినా ఎంపిక చేసిన బ్యాంకు శాఖలు పనిచేశాయి. ప్రభుత్వ పరమైన అన్ని రకాల లావాదేవీలు, పన్ను చెల్లింపులు, ఇతర త్రా బ్యాంకింగ్ కార్యకలాపాలు కొనసాగాయి. ఖాతాదారులు తమ వద్ద ఉన్న చెక్కులను క్లియరింగ్ కోసం బ్యాంకుల్లో సమర్పించారు. నెఫ్ట్, ఆర్టీజీఎస్ లావాదేవీల సేవలు అర్ధరాత్రి 12 వరకు కొనసాగాయి. భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ సూచనల మేరకు పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం కోసం ఆదివారం ఎల్‌ఐసీ శాఖలు జిల్లా వ్యాప్తంగా పనిచేశాయి. పాలసీదారులకు అవసర మైన సేవలను అందించాయి. కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయంతో పాటు అన్ని సబ్ ట్రెజరీ కార్యాలయాలు ఆదివారం పనిచేశాయి. ప్రభుత్వం జారీ చేసిన జీవోల మేరకు ప్రభుత్వ కార్యాలయాల బడ్జెట్, బడ్జెట్‌యేతర బిల్లులు స్వీకరించి తనిఖీలు చేసి టోకెన్ నెంబర్లను కేటాయించి సీఎఫ్ఎంఎస్‌కు తరలించారు.

జూదమాడుతూ పట్టుబడ్డ కానిస్టేబుల్ సస్పెన్షన్

తిరుపతి క్రైం, మార్చి 31: జూదమాడుతూ పట్టుబడ్డ కానిస్టేబుల్ పూర్ణచంద్రరావును సస్పెండ్ చేస్తూ తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి రూరల్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఇతడు.. చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలంలోని కొల్లాగుంట మామిడి తోపులో కొందరితో కలిసి శుక్రవారం సాయంత్రం జూదం ఆడుతున్నాడు. ఆ సమయంలో కార్వేటినగరం పోలీసులు దాడులు జరిపారు. కానిస్టేబుల్ సహా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వీరి నుంచి రూ.5.26 లక్షల నగదు, 11 సెల్ ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో కానిస్టేబుల్‌పై ఎస్పీ శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ సస్పెండు చేశారు.

సరెండర్ లీవు బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ

చిత్తూరు (సెంట్రల్), మార్చి 31: ఉపాధ్యాయుల సరెండర్ లీవుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిత్తూరులో ఆదివారం ఆపస్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌గుప్తా అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలతో పాటు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. సంఘం నాయకులు గంగరాజు, దొరస్వామి, రాజేశ్వరి, విజయ్, హనుమంతరెడ్డి, రాధాకృష్ణ, గిరి, జానకిరామ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తా



రమాదేవి

తవణంపల్లె, మార్చి 31: పూతలపట్టు నియోజకవర్గంలో వైసీపీ రెబల్ అభ్యర్థిగా తాను పోటీ చేస్తానని ఆ పార్టీ నాయకురాలు రమాదేవి తెలిపారు. తవణంపల్లె మండలం పుణ్యసముద్రంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత 14 ఏళ్లుగా వైసీపీకి సేవలందించిన తనకు టికెట్ రాకుండా కొందరు పార్టీ పెద్దలు అడ్డుకొన్నారన్నారు. తనకున్న బంధువర్గం, అనుచర వర్గం సహకారంతో రెబల్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధిస్తానన్నారు.

రెచ్చిపోయిన వైసీపీ ఇసుకాసురులు

- అక్రమ రవాణాను అడ్డుకున్న రైతును చితకబాదారు
- ప్రశ్నించిన మహిళలకు చంపేస్తామంటూ బెదిరింపు



తలకు తగిలిన గాయాన్ని పోలీసులకు చూపిస్తున్న రైతు



కాలప్పపై దాడి చేస్తున్న ట్రాక్టర్ యజమానులు

పిచ్చాటూరు, మార్చి 31: రాత్రీపగలు తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో స్థానికులతో కలిసి ఓ రైతు అడ్డుకున్నాడు. ఇంకేముంది వైసీపీ ఇసుకాసురులు రెచ్చిపోయారు. ఆ రైతును చితకబాదారు. ఈ సంఘటన పిచ్చాటూరు మండలంలోని పులికుండ్రం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అరుణానది పరివాహక ప్రాంతం నుంచి వేలూరు మార్గంలో పులికుండ్రం మీదుగా నారాయణవనం, పుత్తూరుకు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఎలాంటి అనుమతి లేకుండా అధికార పార్టీ నేతలు తరలించేస్తున్నారు. రాత్రిపూట అయితే ఇంకా ఎక్కువ సంఖ్యలో ట్రాక్టర్లను తిప్పుతున్నారు. వీటి వల్ల వస్తున్న శబ్దంతో పులికుండ్రం గ్రామస్థులకు నిద్ర ఉండటం లేదు. పైగా రోడ్డుకు సమీపంలోనే ఇళ్లు ఉండటంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలో ఉన్నారు.ఈ క్రమంలో ఆదివారం వేకువ జామున గ్రామానికి చెందిన కాలప్ప అనే రైతు స్థానికులతో కలిసి ట్రాక్టర్లను అడ్డుకున్నాడు. దీనిపై ఆగ్రహించిన వెంగళత్తూరు సర్పంచ్ అన్నాదొరై (వైసీపీ) తన ట్రాక్టర్ డ్రైవర్, మరికొందరితో కలిసి కాలప్పను చితకబాదాడు. ఇనుప రాడ్డుతో తలపై కొట్టి గాయపరిచారు. ఇదేమి అన్యాయమని స్థానిక మహిళలు ప్రశ్నిస్తే.. 'పిచ్చాటూరుకు వెళ్లాలంటే వెంగళత్తూరు మీదనే వెళ్లాలి.. వెంగళత్తూరులో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరినీ చంపేస్తాం' అని వైసీపీ ఇసుకాసురులు బెదిరించారు. దీంతో గ్రామపెద్దలు కల్పించుకుని సర్ది చెప్పి.. బాధితుడి గాయానికి చికిత్స చేయించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై ఎస్ఐ వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారు ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని చెప్పారు.

సంస్కృత వర్సిటీలో ముగిసిన టాలెంట్ ఫెస్ట్

- ఆతిథ్య వర్సిటీకి విజయ వైజయంతి షీల్డ్ ప్రదానం



మాట్లాడుతున్న ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి(రూరల్),మార్చి31: తిరుపతిలోని సంస్కృత వర్సిటీ వేదికగా నాలుగు రోజులపాటు నిర్వహించిన ఆలిండియా సంస్కృత విద్యార్థుల టాలెంట్‌ఫెస్ట్-2కె24 ఆదివారంతో ముగిసింది. దేశవ్యాప్తంగా ఉన్న పలు సంస్కృత వర్సిటీలకు చెందిన విద్యార్థులు భాషణ, క్రీడా, సాంస్కృతిక, యోగా పోటీలలో పాల్గొని ప్రతిభని చాటారు. అత్యధిక బహుమతులు సాధించిన ఆతిథ్య తిరుపతి సంస్కృత వర్సిటీ విద్యార్థులు విజయ వైజయంతి షీల్డ్‌ని కైవసం చేసుకున్నారు. భాషణ, సాంస్కృతిక, క్రీడా, యోగా వంటి వివిధ పోటీలలో విజేతలుగా నిలచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను చాటేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో హాజరైన కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతి మాట్లాడుతూ సంస్కృతాన్ని ఇంకా అభివృద్ధి చేయాలని, శంకరాచార్యుల మార్గాన్ని అనుసరిస్తూ ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతలకు సంబంధించిన కార్యక్రమాలను విశేషంగా చేపట్టాలని ఆకాంక్షించారు. సీబీడీ విభాగ ఎస్పీ ఎస్‌వీఎస్ స్వామి మాట్లాడుతూ ప్రతిభా పోటీలలో భాగస్వామ్యం కావడమే విజయంతో సమానమని, బహుమతులు సాధించడం ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ వర్సిటీ ద్వారా సంస్కృతభాష సంరక్షణ, ప్రచారంతోపాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ, ప్రొక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ టీవీ రాఘవాచార్యులు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంజీ నందనరావు, అడిషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.దత్తాత్రేయశర్మ, అద్వైత వేదాంత విభాగ ప్రొఫెసర్ గణపతిభట్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపిక





జాతీయ క్రీడలకు ఎంపికైన బాల, బాలికలు

తిరుపతి(క్రీడలు), మార్చి 31 : జాతీయ స్కేటింగ్ అండర్ 17, 19 విభాగాలలో 12మంది చొప్పున బాలబాలికలను ఎంపిక చేశారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో రెండు రోజులుగా ఎంపిక పోటీలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 205మంది ప్రాతినిధ్యం వహించారు. ప్రతిభ కనబరిచిన 12మంది బాలురు, 12మంది బాలికలు ఎంపికయ్యారు. వీరు ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కార్యదర్శులు జయరామయ్య, విజయకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ ప్రేమ్‌నాథ్, శ్రీనివాసులరెడ్డి, రమణారెడ్డి, బాబ్జి, జితేంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు





న్యాయమూర్తుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 31: జిల్లాలో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ పెండింగ్ కేసులన్నీ వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అన్నారు. చిత్తూరులోని జడ్పీ మీటింగ్ హాలులో రెండు రోజుల వర్క్‌షాపు ఆదివారం ముగిసింది. 'అడ్మినిస్ట్రేషన్, సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారం కోసం జ్యుడిషియల్ ఆఫీసర్స్ తీసుకోవాల్సిన చర్యలు' అంశంపై వర్క్‌షాపు జరిగింది. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి జ్యుడిషియల్ అధికారులతో వర్క్‌షాపు జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న 63 రకాల కోర్టుల్లో ఫిబ్రవరి ఆఖరు నాటికి 91,221 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిలో 46,938 సివిల్, 44,283 క్రిమినల్ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. 569 కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. ఫిబ్రవరి నాటికి పెండింగ్‌లో ఉన్న కేసుల కోసం జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాలో 15 కోర్టు భవనాల నిర్మాణాలకు అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. పాకాలలో కోర్టు భవనం, అధనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మదనపల్లెలో నిర్మాణపు పనులు పూర్తయ్యాయని చెప్పారు. చిత్తూరులో నిర్మిస్తున్న రూ.15 కోట్ల భవన నిర్మాణపు పనులు, పలమనేరులో నాలుగు భవన నిర్మాణపు పనులు ఏప్రిల్ నాటికి పూర్తవుతాయన్నారు. ఈ సందర్భంగా వివిధ కోర్టుల పరిధిలో అత్యధిక కేసులు పరిష్కరించిన జడ్జిలను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా జడ్జి రమేష్, అదనపు జిల్లా జడ్జి అన్వర్‌బాషా, ఫ్యామిలీ కోర్టు అదనపు జిల్లా జడ్జి శాంతి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ కరుణకుమార్, పలువురు న్యాయమూర్తులు, జూనియర్ జడ్జిలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకుల డిమాండ్



పాలూరు వద్ద ఇసుక అక్రమ నిల్వలను పరిశీలిస్తున్న కూటమి నాయకులు

చిత్తూరు రూరల్, మార్చి 31: చిత్తూరు రూరల్ మండలం పాలూరు గ్రామం వద్ద అక్రమంగా ఉంచిన ఇసుక నిల్వలపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు డిమాండు చేశారు. వీరంతా కలిసి ఆదివారం ఇసుక అక్రమ నిల్వలను పరిశీలించారు. టీడీపీ ప్రభుత్వంలో ఇసుకను ఉచితంగా ఇస్తే.. వైసీపీ ప్రభుత్వంలో బినామీల పేరుతో ప్రైవేటు సంస్థలకు ఇసుకను ధారాదత్తం చేసిందని కూటమి చిత్తూరు అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఆరోపించారు. దీంతో ఇసుక ధరలు పెంచేసి సామాన్యులకు భారంగా మార్చారన్నారు. రూరల్ మండలం నుంచే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తూ అధికార పార్టీ నేతలు ఆర్థికంగా బలపడుతున్నారన్నారు. ఇంత పెద్ద ఎత్తున రోడ్డు పక్కనే ఇసుక నిల్వ ఉంటే అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని టీడీపీ నేత చంద్రప్రకాష్ అన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఎలక్షన్ కమిషన్ స్పందించి వెంటనే ఈ అక్రమ నిల్వలను సీజ్ చేసి సంబంధితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే తమ మూడు పార్టీ తరఫున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, మేషాక్, వెంకటేష్, రమేష్ నాయుడు, రామ్మూర్తి, కంద తదితరులు పాల్గొన్నారు.

ఫిడె రేటింగ్ ఓపెన్ టోర్నీకి ఎంపిక



ఫిడె రేటింగ్ ఓపెన్ టోర్నీకి ఎంపికైన చెస్ క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), మార్చి 31 : భీమవరంలో జూన్ 4నుంచి 9వ తేదీ వరకు జరిగే ఫిడె రేటింగ్ ఓపెన్ టోర్నమెంట్‌కు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆదివారం యూత్ హాస్టల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. 102మంది అండర్ 7, 9, 11, 13 విభాగాల్లో పోటీపడ్డారు. ప్రతిభ కనబరిచిన వి.త్రిపురాంబిక, కె.లతీష్‌రెడ్డి, కె.ఈ.కె.బిల్వనిలయ, ఎస్.అభిజయ్‌ను ఎంపిక చేశారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాలర్ దివాకర్‌రెడ్డి క్రీడాకారులను అభినందించి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

4 నుంచి అన్నమయ్య వర్ధంతి కార్యక్రమాలు

తిరుపతి (కల్చరల్), మార్చి 31: పదకవితా పితామహుడు అన్నమయ్య 521వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సులు నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. 4వ తేదీ ఉదయం 6 గంటలకు అలిపిరి వద్ద మెట్లోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొంది. 5న తిరుమలలో ఇదే కార్యక్రమం ఉంటుందని తెలిపింది. 6నుంచి 8వ తేదీ వరకూ తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సభలు నిర్వహిస్తారని వెల్లడించింది.

చంద్రబాబుకు ఘన వీడ్కోలు



చంద్రబాబు నుదుటన బొట్టు పెడుతున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 31: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు శ్రీకాళహస్తిలో ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణంలో శనివారం జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు టీడీపీ అధినేత విచ్చేసిన విషయం తెలిసిందే. సభ అనంతరం ఆయన స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద బస చేశారు. ఈ నేపథ్యంలో చంద్రబాబును కలిసి వీడ్కోలు పలికేందుకు ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచే పెద్ద సంఖ్యలో టీడీపీ, బీజేపీ జనసేన, నేతలు కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి పాదాల చెంత శ్రీచక్రంపై అర్చించిన కుంకుమను, ముక్కంటి ఆలయ తీర్థ ప్రసాదాలను చంద్రబాబుకు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అందజేశారు. అనంతరం బొజ్జలతో అధినేత ఏకాంతంగా చర్చలు జరిపారు. తర్వాత మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత దంపతులు చంద్రబాబును కలిసి శేష వస్త్రంతో సత్కరించారు. అలాగే తన కారవాన్ నుంచి మాజీ సీఎం వెలుపలకు రాగానే పలువురు నాయకులు ఘనంగా సత్కరించి, దేవతామూర్తుల చిత్రపటాలను బహూకరించారు. ఉదయం 10.31 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి చంద్రబాబు కాన్వాయ్ బయల్దేరింది. ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలోని హెలిప్యాడ్ చేరుకుని 10.41 ప్రాంతంలో హెలికాప్టర్‌లో కర్నూలు జిల్లా పర్యటనకు వెళ్లారు.

'కూటమి'లో అభిప్రాయ భేదాల్లేవ్

- వలంటీర్లను తొలగిస్తామనే తప్పుడు ప్రచారాలు నమ్మొద్దన్న టీడీపీ

చిత్తూరు సిటీ, మార్చి 31: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నేతలు, కార్యకర్తల మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేవని చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ స్పష్టంచేశారు. తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిరోజూ తామంతా కలిసి గడప గడపకు ప్రచారం నిర్వస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగించబోమని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రతి సభలోనూ హామీ ఇస్తున్నారని గుర్తుచేశారు. అయినా వీటిపై కొందరు వైసీపీ నేతలు కావాలనే సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. వీటిని నమ్మొద్దని ఆయన కోరారు. వలంటీర్ల చేత బలవంతంగా రాజీనామాలు చేయించి సొంత ప్రచారాలకు రావాలని వైసీపీ అభ్యర్థులు బెదిరించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దొరబాబు, వైపీ రాజేశ్వరి, బీజేపీ నేతలు చిట్టి బాబు, అట్లూరి శ్రీనివాసులు, హరిబాబు చౌదరి, జనసేన నాయకులు దయారాం, యశ్వంత్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా

- పట్టీపట్టనట్లు రెవెన్యూ శాఖ



కుర్రకాలువ పాకశాస్త్ర విశ్వవిద్యాలయం ఎదురుగా ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లు

రేణిగుంట, మార్చి 31: కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నా రెవెన్యూశాఖ పట్టీపట్టనట్లు ఉంటోందని స్థానికులు విమర్శిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. రేణిగుంట మండలం కుర్రకాలువ లెక్క దాఖలాలో సర్వే నెంబరు 112/1, 2, 3లో నాలుగున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వ అవసరాలకు గతంలో రిజర్వుచేసిన ఈ భూమిలో ప్రైవేటు వెంచర్‌ను తలపించేలా రోడ్లు వేసి.. చిన్న చిన్న ఇళ్లను నిర్మించి మరీ విక్రయించేస్తున్నారు. గతంలో ఇదే భూమిలో నిర్మాణాలు చేపడితే రెవెన్యూశాఖ తూతూ మంత్రంగా రెండు ఇళ్లను కూల్చి చేతులు దులుపుకుంది. ప్రస్తుతం యథేచ్ఛగా చిన్నపాటి ఇళ్లను నిర్మించి అమ్ముకుంటున్నారు. దీనివెనుక వేరే పంచాయతీ పరిధిలోని ఇద్దరు సర్పంచులు ఉన్నట్లు సమాచారం. వీరు తమ పేరు బయటపడకుండా తిరుపతికి చెందిన ఓ దళిత నేతను ముందుపెట్టి పని కానిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనిలోపనిగా.. పెట్టుబడి పెడితే చాలు అంతా తాము చూసుకుంటామని.. మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న విలువైన ప్రభుత్వ భూములను రాత్రికి రాత్రే వీరు కబ్జా చేస్తున్నారని వాపోయారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూశాఖ పట్టించుకోక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో పాకశాస్త్ర విశ్వవిద్యాలయం, టీసీఎల్, మరెన్నో పరిశ్రమలు రావడంతో భూముల విలువ అమాంతంగా పెరిగిపోయింది. అందువల్ల కలెక్టర్ స్పందించి.. విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూడాల్సి ఉంది.

జాతరకు సుగుటూరు గంగమ్మ ఆలయం ముస్తాబు



ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్న కార్మికులు

పుంగనూరు, మార్చి 31: ఈనెల 2, 3వ తేదీల్లో వైభవంగా జరిగే పుంగనూరు గంగజాతర సందర్భంగా సుగుటూరు గంగమ్మ ఆలయాన్ని ముస్తాబు చేశారు. స్థానిక నగరి జమీందారీ ప్యాలెస్‌లో ఉన్న గంగమ్మను మంగళవారం బయటకు తీసుకొచ్చి ఊరేగిస్తారు.ఈ సందర్భంగా ఆలయానికి రంగులు వేసి, చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు, పరిసరాలను శుభ్రం చేయడం వంటి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి జాతర ఏర్పాట్లపై జమీందారీ వంశస్తులతో చర్చించి మున్సిపల్ కార్మికులతో పనులు చేయిస్తున్నారు. అలాగే సుగుటూరు గంగమ్మ జాతరపై జమీందారీల ఆదేశాల మేరకు కొంతమంది యువకులు వ్యక్తిగత సహాయకులుగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. విద్యుత్ అలంకరణ పనులు, పార్కింగ్ పనులు కొనసాగుతున్నాయి.

జనసేనలో చేరిన యువత



పలమనేరు, మార్చి31 : పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఆదివారం పలువురు యువకులు జనసేన పార్టీలో చేరారు. జనసేనలో చేరిన వారికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి, జనసేన నాయకులు దిలీప్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జనసేన పార్టీలో చేరిన వారిలో గంగవరం మండలానికి చెందిన షబ్బీర్, అలీమ్, అబ్దుల్, అసిఫ్, అల్లాబక్ష, నూర్ మహమ్మద్, ఆరీఫ్, యాసిన్, జీర్విన్, అమన్, నూర్‌భాషా, ఇమ్రాన్, ఫీర్‌భాషా, సాదిక్, ఖైనుద్దీన్, సక్లైన్ అలిస్, ఆదిల్, బాసిమ్, ఫరూక్ తదితరులున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చందు, నాగరాజు, రమేష్, ఆయాజ్, అస్లాం, షన్ముగం, సాంబా, లోకనాథ్‌తోపాటు టీడీపీ నాయకులు ఆర్వీ బాలాజి, ఆర్బీసీ కుట్టి, ఖాజాపీర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ కుమార్ రెడ్డిని కలసిన టీడీపీ నాయకులు



సోమల, మార్చి 31: మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని ఆదివారం సోమల మండల టీడీపీ నాయకులు కలికిరిలో కలసి సంఘీభావం తెలిపారు. ఆయనను సన్మానించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు యదుశేఖర్ నాయుడు, తెలుగు రైతు సంఘ నాయకుడు సీఎం సురేశ్,మాజీ సర్పంచు శ్రీనివాసులు నాయుడు, బాబురావు, రషీద్, రఘు, మునిరెడ్డి, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రొంపిచెర్లలో టీడీపీ బైక్ ర్యాలీ

రొంపిచెర్ల, మార్చి 31: పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లారామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు రొంపిచెర్ల క్రాస్‌నుంచి గానుగ చింత పంచాయతీ చల్లంపల్లె వరకు బైక్ ర్యాలీ జరుగుతుందని నియోజక వర్గం ఐ-టీడీపీ అధ్యక్షుడు గూడూరు హరిబాబు తెలిపారు. ఈ ర్యాలీలో చల్లాబాబు పాల్గొంటారని, మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ అన్ని అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వైభవంగా కురబ జాతర



నెత్తిమీద కొబ్బరికాయలు కొట్టించుకుంటున్న భక్తులు

కుప్పం, మార్చి 31: కుప్పం పట్టణం కొత్తపేటలో వెలసిన సిద్దేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం కురబ కులస్తులు జాతరను వైభవోపేతంగా జరుపుకొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు నెత్తిమీద కొబ్బరికాయలు పగులగొట్టించుకుని స్వామిపై తమ భక్తిని చాటుకున్నారు. కురబ కులస్తులు ఈ జాతరలో పాల్గొని స్వామివారి కృపకు బాధ్యులయ్యారు.

యువత నిర్ణయంపైనే రాష్ట్ర భవిష్యత్తు

రామకుప్పం, మార్చి 31: రానున్న ఎన్నికల్లో యువత తీసుకునే నిర్ణయం పైనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలుగు యువత రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. ఆదివారం బందార్లపల్లె, చెల్దిగానిపల్లె, బల్ల పంచాయతీల తెలుగు యువత సమావేశాల్లో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ళ వైసీపీ పాలనలో యువత తీవ్ర మోసానికి గురయ్యారన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కరవై యువతీ, యువకుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే రాష్ట్రంలో తిరిగి టీడీపీ ప్రభుత్వం రావాలన్నారు. ఆయా సమావేశాల్లో నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, రెడ్డిపురుషోత్తం, సురేష్ చిన్నసురేష్, సలాం, హనుమంతు, శంకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు లక్ష మెజారిటీ రావాలి

రామకుప్పం, మార్చి 31: కుప్పం ప్రజలు టీడీపీ అధినేత చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజారిటీ అందించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, బందార్లపల్లె అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి కోరారు. ఆదివారం వారు సగినేకుప్పంలో ఇంటింటా సూపర్‌సిక్స్ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీరని అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్, సోమశేఖర్, ప్రకాష్‌యాదవ్, మునస్వామి, వెంకట పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రామకుప్పం, మార్చి 31: రామకుప్పం ఏపీ ఆదర్శ పాఠశాలలో 2024-2025 విద్యాసంవత్సరానికి గానూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆసక్తి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి కోరారు. ఏప్రిల్ 6లోగా ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ లేక సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 40సీట్లు చొప్పున ఉన్నాయని తెలిపారు.

బైండోవర్ కేసులు తగవు

పుంగనూరు, మార్చి31: తెలుగుదేశం పార్టీ శ్రేణులను ఎన్నికలకు దూరంగా ఉంచేలా పుంగనూరు పోలీసులు ఏకపక్షంగా బైండవర్ కేసులతో భయాందోళనలు సృష్టిస్తున్నారని టీడీపీ మైనార్టీ నాయకుడు ఎస్.సుహేల్‌బాషా ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో అధికార వైసీపీ నాయకుల సూచనలతో పోలీసులు బైండవర్ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టుతున్నారని మండిపడ్డారు.

శాంతిపురంలో పోలీసు కవాతు

శాంతిపురం, మార్చి 31 : శాంతిపురంలో ఆదివా రం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వ హించాయి. శాంతిపు రం నుంచి బడుగుమాకుల పల్లె సంత వరకు ర్యాలీ కొన సాగింది. శాంతిపురం ప్రధాన వీధుల్లో వారు కవాతు నిర్వహించారు. ఓటర్లు తమ ఓటు హక్కు ను నిర్భయంగా వినియో గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, రాళ్ళబూదుగూరు ఎస్ఐ సుమన్, శాంతిపురం తహసీల్దార్, మురళీకృష్ణ, డిప్యూటీ తహసిల్దార్ కౌలేష్ తదితరులు పాల్గొన్నారు.

కందూరులో గంగజాతర ప్రారంభం

సోమల : కందూరులో గంగ జాతరను పురస్కరించుకుని ఆదివారం రాత్రి నడివీధిలో అమ్మవారి ని ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.అమ్మవారి మండపం వద్ద చలువ పందిళ్ల, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాట్లు చేశారు. బలిపోతు, చల్లకుండల్లు ఇంటింటా మహిళలు పూజలు జరిపారు.

వైభవంగా ఈస్టర్ వేడుకలు



పలమనేరులో విద్యుత్ దీపాలంకరణలో పురాతన చర్చి, కల్లూరు క్రైస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పలమనేరు, మార్చి31 : పలమనేరులో ఆదివారం క్రిస్టియన్ సోదరులు ఈస్టర్ పండుగను వైభవంగా జరుపుకొన్నారు. ఏసుక్రీస్తును శిలువ వేసి సమాధి చేసిన అనంతరం మూడవరోజు పునరుద్ధానమై తిరిగి వచ్చినట్లు క్రైస్తవుల నమ్మకం. ఈస్టర్ రోజున ఏసుక్రీస్తు పునరుద్ధానమైన రోజుగా వారు పండుగను జరుపుకొంటారు. ఆదివారం తెల్లవారుజామునే వారు పట్టణంలోని పురాతన చర్చికి చేరుకొని ప్రార్థనలు చేశారు. ఫాదర్ దేవుడి వాక్కులను వివరించారు.

కల్లూరు : కల్లూరు బీసీ కాలనీలోని క్రైస్ట్ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ ధనరాజ్ మాట్లాడుతూ క్రీస్తు ప్రభువు పునరుత్థానం చేసిన మహోన్నత రోజు ఈస్టర్ అని, క్రైస్తవులు పునరుత్థాన శక్తితో ఆధ్యాత్మికంగా పునీతులు కావాలన్నారు. ప్రభువు చూపిన మార్గంలో శాంతి, సహనం, పరస్పర సహకార గుణాలతో అన్ని వర్గాలు జీవించాలని సూచించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోదండరామయ్య, సుశీల, టైటస్, రీన, రాజేష్, సత్యవతి, చెంగల్రాయులు, సునీల్ గవాస్కర్, భాగ్యమ్మ భక్తులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : క్రీస్తు పునరుద్ధాన పండుగను ఆదివారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ మెమోరియల్ చర్చిలో పాస్టర్ రాకేశ్‌ని ప్రైమోద్ ఏసుక్రీస్తు శిలువై మృతి చెంది మూడవ దినం సజీవుడై తిరిగి లేచారని వివరించారు. ఏస్తుక్రీస్తు ఎన్నో శ్రమలకు ఓర్చి, పాపులను సైతం సన్మార్గంలో నడిపించారని, ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ పాటించి దయ, ప్రేమ, దాన గుణాలతో మెలగాలని తెలిపారు. అనంతరం సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు. అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



పుంగనూరులో సమాధుల వద్ద ప్రార్థనలు

వైభవంగా నలగుండ్రాయస్వామి పుష్పపల్లకీ సేవ

బైరెడ్డిపల్లె, మార్చి 31 : మండలంలోని కడపనత్తంలో వున్న నలగుండ్రాయస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన పుష్పపల్లకీసేవ శనివారం రాత్రి వైభవంగా జరిగింది. వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దిన పల్లకీలో అలివేలుమంగ, పద్మావతీ సమేత నలగుండ్రాయస్వామి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ గావించి కొలువుదీర్చారు. అనంతరం అర్చకులు రామకృష్ణాచార్యులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచాపేలుళ్లు, పండరి భజనలు, కోలాట ప్రదర్శనలతో భక్తుల గోవిందనామస్మరణల మధ్య పుష్ప పల్లకీ ఊరేగింపు జరిగింది. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మంగళహారతులిచ్చారు. ఆలయంవద్ద పాతూరు నత్తం రామకృష్ణాచారి కుటుంబీకులచే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త మురళి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విశేషాలంకరణలో ఉత్సవమూర్తులు, పుష్పపల్లకీలో ఊరేగుతున్న నలగుండ్రాయస్వామి

కర్ణాటక మద్యం స్వాధీనం : నలుగురి అరెస్టు

గుడుపల్లె, మార్చి 31: కర్ణాటక నుంచి గుడుపల్లె మీదుగా ద్విచక్ర వాహనాల్లో తరలిస్తున్న రూ.1.66 లక్షల విలువైన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. గుడుపల్లె పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ శ్రీనాథ్ కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మీకాంత్‌లతో కలిసి ఈ వివరాలను వెల్లడించారు. పోలీసులు ఆదివారం కర్ణాటక సరిహద్దులోని బిసానత్తం చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక నుంచి నలుగురు వ్యక్తులు తమ ద్విచక్ర వాహనాల్లో పెద్ద సంచుల్లో మద్యం ఉంచుకొని పోలీసులను గమనించి వాహనాలను వదిలి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకొన్నారు. వారి సంచులను తనిఖీ చేయగా 4,224 ప్యాకెట్ల మద్యం ఉందన్నారు. గుడుపల్లె మండలం కనమనపల్లెకు చెందిన ఆర్. తాండవకృష్ణ(34), ఆర్.రాజశేఖర్ (38), వి.మంజునాథ్ (36), వి.రమేష్ కుమార్(34)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులో చురుగ్గా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ చక్రపాణి, పోలీసులు రత్నప్ప, నటరాజ్, రామకృష్ణ, శ్రీనివాసులును అభినందించి రివార్డులను అందజేసారు.



స్వాధీనం చేసుకొన్న మద్యంతో డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, పోలీసులు

తెలుగుదేశం పార్టీలోకి భారీ చేరికలు



రొంపిచెర్లలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు, టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి అమరనాథరెడ్డి

రొంపిచెర్ల, మార్చి 31: పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి ఇంటి వద్ద పులిచెర్ల మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి ఆదివారం చేరారు. రాజేష్, సురేష్, భాను, జయకుమార్, గురునాథ్‌తోపాటు 15 కుటుంబాలు టీడీపీలో చేరగా చల్లాబాబు వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, నవీన్‌కుమార్, హరిబాబు, రవినాయుడు పాల్గొన్నారు. అలాగే సోమల మండలం అన్నమ్మగారిపల్లెకు చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు.

పలమనేరు : పలమనేరులో ఆదివారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో మున్సిపాలిటీలోని 7వ వార్డుకు చెందిన యువకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ అమరనాథరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గంటావూరు కాలనీకి చెందిన ఈశ్వరమ్మ, అలివేలమ్మతోపాటు పరమేష్, హరి, వెంకటరమణ, జయకుమార్ రెడ్డి, భరత్, హరి, తన్వీర్, తులసిరామ్, రంజిత్‌కుమార్, హరిప్రసాద్, హసేన్, సిద్దిక్, వరప్రసాద్, సుహేల్, షాహిద్, గంగరాజు, సాహిన్నా, మహేష్, బాలు తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్బీసీకుట్టి, శ్రీధర్, అబ్దుల్లా, జగదీష్, వార్డు ఇన్‌ఛార్జి గిరి, వెంకటేష్, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం : స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం రాత్రి మణీంద్రంకు చెందిన షణ్ముగం, సుబ్రహ్మణ్యంలు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు శ్రీరాములురెడ్డి, రామలింగారెడ్డి, నందారెడ్డి, వెంకటరమణ, భానుమూర్తి, కేశవరెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, మణీంద్రనాగరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు నుంచి విశ్రాంత డీఎస్పీ పోటీ



సుకుమార్‌ను అభ్యర్థిగా ఖరారు చేసిన పత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాసులు

పుంగనూరు, మార్చి31: రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల్లో వాల్మీకి కులస్తులు పోటీ చేయనున్నట్లు వాల్మీకి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పుంగనూరులో జరిగిన వాల్మీకి సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరు అసెంబ్లీ అభ్యర్థిగా రాష్ట్రవాల్మీకి సంఘ గౌరవాధ్యక్షుడు, విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబును తాము ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ప్రకటించి పత్రాన్ని అందజేశారు. సమావేశంలో నాయకులు గంపల గంగరాజు, బి.లక్ష్మన్న, ఎస్.జయసింహ, వి.మంజునాథ్, ఎస్.వెంకటరమణ, కె.నరసింహులు, నిర్మలమ్మ, మల్లిఖార్జున, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.


అనుమతి లేదని షామియానా తొలగింపు

గంగవరం, మార్చి 31 : మండలంలోని చిన్నూరులో వైసీపీ నాయకులు వేసిన టెంట్ (షామియానా)కు అనుమతి లేదని ఎంపీడీవో విద్యాసాగర్ తొలగించారు. ఆదివారం చిన్నూరులో ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా స్థానిక నాయకులు చిన్నూరులోని రోడ్డుపై షామియానా వేసి మైకులు సిద్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో, సిబ్బంది చిన్నూరు గ్రామానికి చేరుకొని సభా ప్రాంగణం, షామియానాలు వేయాలంటే ముందుగా కచ్చితంగా అనుమతి పొంది ఉండాలన్నారు. షామియానా తొలగించాలని, లేకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించడంతో తొలగించేశారు.

పేదలకు సేవ చేయడయే మానవత సంస్థ ధ్యేయం

పుంగనూరు రూరల్, మార్చి31: పేదలకు సేవ చేయడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయమని సంస్థ ఉమ్మడి జిల్లా చైర్మన్ జె.కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవన్‌లో జరిగిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరు మానవత సంస్థ అనేక సేవాకార్యక్రమాలు చేపడుతూ ముందుంటోందని అభినందించారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు నందీశ్వరయ్య, సరస్వతమ్మ, నారాయణరెడ్డి, నానబాల గణేశ్, పూల త్యాగరాజు, నరసింహారెడ్డి, భక్తవత్సలరాజు, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేద్దాం



సమావేశమైన జనసేన, టీడీపీ నాయకులు

గంగవరం, మార్చి 31 : మాజీ మంత్రి అమరనాథ రెడ్డి గెలుపుకోసం కలసికట్టుగా పనిచేయాలని జనసేన, టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పసపత్తూరు పంచాయతీలో వారు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు గ్రామాల్లో తిరిగి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేనకు చెందిన భాస్కర్‌రెడ్డి, వెంకటప్ప, శేఖర్, సోమశేఖర్, సోము, వెంకటాద్రి, రామాంజులు లతోపాటు పలువురు పాల్గొన్నారు.

గుండె వైద్య శిబిరం విజయవంతం

కుప్పం, మార్చి 31: కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం కోలార్‌కు చెందిన జలపా నారాయణ హృదలాయ, వైద్య సిబ్బందిచే కుప్పంలోని బీఆర్డీ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 80 మంది గుండె రోగులను పరీక్షించినట్లు లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ మహేశ్, కుప్పం అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్ తెలిపారు. వీరిలో 8 మంది రోగులను శస్త్ర చికిత్సకు సిఫార్సు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం లయన్స్ క్లబ్ కార్యదర్శి సెల్వం, సభ్యులు కుమార్, చరణ్, లెనిన్, కిరణ్‌కుమార్, వెంకటరామ్‌రెడ్డి, లియో అమిగోస్ కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



పలమనేరు, మార్చి31 : పలమనేరు సిల్కుఫారం వద్ద నివాసమున్న కాలనీలో వృద్ధులకు, చిన్నపిల్లలకు ఆదివారం సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నార్థులకు అన్నం అందజేయడం ఎంతో సంతృప్తికరంగా వుందన్నారు.

బోయకొండ గంగమ్మకు పూజలు



చౌడేపల్లె, మార్చి31: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

గంగమ్మకు విశేష పూజలు

సోమల, మార్చి 31: సోమల వారపుసంత వద్ద వెలసిన బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకులు అభిషేకపూజలు, అర్చనలు చేశారు. మహిళలు ఉపవాస దీక్షలతో అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించారు.

వీడని ఏనుగుల దాడులు

సోమల, మార్చి 31: సోమల మండలం అన్నెమ్మగారి పల్లె పరిధిలోని పొలాల్లో ఏనుగుల సంచారం ఆగడం లేదు. శనివారం రాత్రి వడ్డిరామాపురం సమీప చెరువు వద్ద మకాం వేసిన ఏనుగులు ఆప్రాంతంలోని మామిడి తోటలు, టమోటా, వరి పొలాల్లో సంచరించి పంటలను తొక్కివేశాయి. వెంకటరమణకు చెందిన వరి పొలం, రామూర్తి టమోటా తోటల్లో దాడులు జరిగినట్లు రైతులు తెలిపారు. సుమారు రూ. 1.30 లక్షలు మేరకు నష్టం జరిగిందని రైతులు తెలిపారు.

హైకోర్టు న్యాయవాదిని కలిసిన అమర్

పలమనేరు, మార్చి31 : పలమనేరు మున్సిపల్ పరిధి గొబ్బిళ్లకోటూరులోని హైకోర్టు సీనియర్ న్యాయవాది గంగయ్యనాయుడు స్వగృహంలో అమరనాథరెడ్డితోపాటు టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంగయ్యనాయుడు మాట్లాడుతూ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ అమరనాథరెడ్డిని ఈసారి భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యంగౌడు, సుబ్బనాగయ్య, సోమశేఖర్‌నాయుడు, కోటీశ్వర్లు, రమేష్, బాలాజి, సుబ్రమణ్యం, మంజునాథ్ పాల్గొన్నారు.

కాలువపల్లిలో భగవద్గీతపై ప్రచారం

పలమనేరు, మార్చి31 : పలమనేరు మండలం కాలువపల్లిలో ఆదివారం భగవద్గీతపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందుజ్ఞానవేదిక సభ్యులు ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇందుజ్ఞాన వేదిక అధ్యక్షులు భాస్కర్, డి.బాలాజి, సభ్యులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



పుంగనూరు రూరల్, మార్చి31: ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధం కావడంతో రూ. 20వేలు నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. ఆదివారం పట్టణ సమీపంలోని ఇనాయత్‌నగర్‌కు చెందిన చిన్నప్ప నిల్వ చేసిన గడ్డివామి అగ్ని ప్రమాదానికి గురైంది. రైతు సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్లు ఆయన తెలిపారు.

బీసీవై పార్టీని ఆదరించండి



సోమల, మార్చి 31: రైతు రాజ్యం కోసం బీసీవై పార్టీని ఆదరించాలని ఆపార్టీ నాయకులు ఆదివారం సోమల మండలంలో ప్రచారం చేశారు. పెద్దఉప్పరపల్లె, నాగిళ్ల వారిపల్లె, అన్నెమ్మగారిపల్లె, వడ్డిరామాపురం, చిన్నకమ్మపల్లె తదితర గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు చెరుకు రైతు గుర్తుకు ఓటు వేయాలని మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. బీసీవైపీ నాయకులు సురేంద్ర యాదవ్, సాంబ, బాలకృష్ణ యాదవ్, భాస్కర్ యాదవ్, శంకర్, చిట్టిబాబు, వేణు, నారాయణస్వామి, సుబ్రమణ్యం రెడ్డి, వెంకటేశ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

పుంగనూరు రూరల్, మార్చి31: విద్యార్థి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ జానకీరామ్ తెలిపారు. పుంగనూరు ఎన్ఎస్‌పేటకు చెందిన ముక్తియార్ కుమార్తె(14) శనివారం ఉదయం స్నేహితురాలి వద్ద పుస్తకాలు తీసుకువస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి ముక్తియార్ ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నిత్యాన్నదానం, గో సంరక్షణకు రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), మార్చి 31: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం, గో సంరక్షణ ట్రస్టుకు కలిపి ఆదివారం విజయవాడకు చెందిన మోహన్‌దుర్గా రామకుమార్ రూ.లక్షను విరాళంగా అందించారు. అన్నదాన కార్యక్రమానికి రూ.50,116, గో సంరక్షణ ట్రస్టు నిర్వహణకు రూ.50,116 విరాళంగా అందించారు. దాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం దాతను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకతాటిపైకి ఐరాల మండల తెలుగు తమ్ముళ్లు



సమావేశంలో పాల్గొన్న మురళీమోహన్, టీడీపీ నాయకులు

ఐరాల, మార్చి 31: ఐరాల మండల తెలుగు తమ్ముళ్లు అందరూ కలసికట్టుగా పని చేసి ఈ ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయనున్నట్లు పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ తెలిపారు. మండలంలోని వేదగిరివారిపల్లె పంచాయతీ నాగులవారిపల్లెలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య చిన్నచిన్న మనస్పర్థలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఎన్నికల కారణంగా మనస్పర్థలను పక్కన పెట్టి పార్టీ విజయానికి పాటుపడటానికి అందరూ కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి పని చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిరిధర్‌బాబు, సురేంద్రబాబు, జయచంద్రయ్య, ప్రతాప్ నాయుడు, దయానంద నాయుడు, బాబు నాయుడు, నటరాజ్, జలీల్‌బాషా, ప్రసాద్, అరుణ్‌కుమార్, గుర్రప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖజానా ఖాళీ అవడంతోనే పెన్షన్ నిలిపివేత

● డబ్బులన్నీ కాంట్రాక్టర్లకు కట్టబెట్టిన సీఎం: టీడీపీ

చిత్తూరు సిటీ, మార్చి 31: వైసీపీ ప్రభుత్వ ఖజానా ఖాళీ అవడంతోనే పెన్షన్ ఇవ్వలేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెల ఒకటవ తేదీన ఇవ్వాల్సిన పెన్షన్‌ను ఈనెల ఇవ్వకపోవడానికి కారణం ఖజానాలో డబ్బులు లేకపోవడమేనని చెప్పారు. సీఎం జగన్ సర్కార్ నిబంధనలకు విరుద్ధంగా రూ.2 వేల కోట్లను తమకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు అందజేశారని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం వలంటీర్లను పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనవద్దని చెప్పిందే కాని పెన్షన్ పంపిణీ చేయవద్దని చెప్పలేదని స్పష్టం చేశారు. పంచాయతీ సెక్రెటరీలు, వీఆర్వోలు, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పెన్షన్లు పంపిణీ చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు వెంకటేష్ యాదవ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'గురజాల'కే ఆర్యవైశ్యుల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 31: ఆర్యవైశ్యుల మద్దతు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కేనని ఆ సంఘం నేతలు చెప్పారు. ఆదివారం నగరంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గురజాల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాపారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకునేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో వ్యాపారులు ఎవరూ వైసీపీ గూండాలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఉమ్మడి పార్టీనేతలు అండగా ఉంటారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేత చంద్రప్రకాష్, ఆర్యవైశ్య సంఘం నేతలు జీవీ ప్రకాష్, సత్యనారాయణ గుప్త, బద్రీనాథ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

డివిడెండ్లు త్వరగా తీసుకోండి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 31: చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఖాతాదారులకు బ్యాంకు ప్రకటించిన డివిడెండ్లను త్వరగా తీసుకోవాలని బ్యాంకు సీఈవో దొరైస్వామి శ్రీనివాసన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ దృష్ట్యా ఈ సారి డివిడెండ్లను ప్రకటించలేదని చెప్పారు. గత రెండేళ్లలో ప్రకటించిన డివిడెండ్లను 20శాతం మంది తీసుకోలేదని అన్నారు. వాటాదారులు తమ వాటాలను ఏక్లాస్ వాటాల కింద మార్చుకోవాల్సిందిగా ఆయన కోరారు. బ్యాంకు ఖాతాదారులు బ్యాంకు పనివేళల్లో తమ కేవైసీని సరిచూసుకోవాలని ఆయన వెల్లడించారు.

వెనుకవైపు నుంచి కంటైనర్‌ను ఢీకొన్న కారు

● ముగ్గురికి గాయాలు



కంటైనర్‌ను ఢీకొన్న కారు



గాయపడిన లక్ష్మి

బంగారుపాళ్యం, మార్చి 31: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి కొత్తపల్లె సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నై టీ నగర్‌కు చెందిన లక్ష్మి కుమారుడు రేవంత్ మదనపల్లె వద్ద ఉన్న రిషివ్యాలీ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. రేవంత్‌కు సెలవులు రావడంతో అతడి అమ్మ, అన్న విశ్వజిత్‌లు వచ్చి కారులో తీసుకెళుతుండగా, కొత్తపల్లె బ్రిడ్జి వద్ద కారు అదుపు తప్పి బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కంటైనర్‌ను వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మి తీవ్రంగా గాయపడటంతో బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్య నిమిత్తం వేలూరు సీఎంసీకి తరలించారు. విశ్వజిత్, రేవంత్‌లు బెల్టులు వేసుకోవడంతో వారికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ పండగ

గుడిపాల, మార్చి 31: మండలంలోని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ఈస్టర్ పండగను జరుపుకున్నారు. ఏసుప్రభు మరణించిన మూడో రోజు ప్రాణంతో లేచిన రోజునే ఈస్టర్ పండుగగా క్రైస్తవులు కొలుస్తారు. ఈ సందర్భంగా ఇంద్రానగర్, బసవాపల్లె, సియోన్‌మల్లె, గుడిపాల అరుంధతి వాడ, బొమ్మసముద్రం తదితర చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

భార్య, పిల్లలపై తండ్రి దాడి

చిత్తూరు, మార్చి 31: కట్టుకున్న భార్య, పిల్లలపై తండ్రి, ఆయన బంధువులు దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండో పట్టణ సీఐ ఉలసయ్య కథనం మేరకు... సంతపేటకు చెందిన మాజీ కౌన్సిలర్ శరవణకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. శరవణ తన అన్నతో కలిసి ఉన్న ఇంటిని ఖాళీ చేయమని భార్య, పిల్లలను బెదిరించాడు. వారు ఖాళీ చేయకపోవడంతో శరవణ తన అన్న చందామల్లై, ఆయన కుమారుడు దిలీప్‌తో కలిసి భార్యాబిడ్డలపై దాడి చేశారు. బాధితురాలు శంకరి ప్రియ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

భార్యపై భర్త దాడి

చిత్తూరు, మార్చి 31: తనకు తెలియకుండా పెద్ద మొత్తంలో అప్పు తీసుకున్న భార్యను చితకబాదిన భర్తపై ఆదివారం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉలసయ్య కథనం మేరకు నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన అరుణ్ షామియానా షాపును నిర్వహిస్తున్నాడు. ఇతడి భార్య భువనేశ్వరి భర్తకు తెలియకుండా రూ.10 లక్షలు అప్పు చేసింది. ఈ విషయం తెలుసుకున్న భర్త తనకు తెలియకుండా ఎందుకు తీసుకున్నావని భార్యను పలుమార్లు అడిగాడు. సరైన సమాధానం రాకపోవడంతో ఆమెను చితకబాదాడు. ఈ సంఘటనపై భువనేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న పంటపల్లె గ్రామస్తులు

పూతలపట్టు, మార్చి 31: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో ఆదివారం పంటపల్లెకు చెందిన బాలాజీ చౌదరి కుటుంబ సభ్యులు భోజన వితరణ చేశారు. కార్యక్రమంలో సురేంద్ర, సురేష్, హరి, రమేష్, భరత్, దాము, బాలాజీ, హేమాద్రి, ధనశేఖర్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నేత యువరాజులు నాయుడు, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, మాజీ కన్వీనర్ చంద్రమౌళి, చిరంజీవి, ప్రమోద్ పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి నివాళులు



మృతుడికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

బంగారుపాళ్యం, మార్చి 31: మండలంలోని కేజీ సత్రానికి చెందిన టీడీపీ అభిమాని రంగనాయకులు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షులు ఎన్‌పీ జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్, నేతలు ధరణీ నాయుడు, రమేష్, హరిప్రసాద్‌లు రంగనాయకుల పార్థివదేహానికి నివాళులు అర్పించారు.

నకిలీ ఇంటి పట్టాలతో ఇళ్ల నిర్మాణాలు ఆపాలి

చిత్తూరు రూరల్, మార్చి 31: చిత్తూరు నగర పరిధిలోని తిమ్మసముద్రం రెవెన్యూ గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ సర్వే నెం.94, మురకంబట్టు రెవెన్యూ గ్రామంలోని సర్వే నెం.621/1లో ఉన్న అపోలో కాలనీలో కొంత మంది బినామీలు నకిలీ ఇంటిస్థల పట్టాలు తయారు చేసుకొని భూకబ్జాకు పాల్పడుతున్నట్లు అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని చిత్తూరు తహసీల్దార్ శ్రీనివాసులు రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రస్తుతం ఎన్నికల విధుల్లో నిమగ్నమైనందున పై తెలిపిన లే అవుట్‌లో నకిలీ ఇంటి పట్టాలు కలిగిన వారు ఇంటి నిర్మాణం చేపడతే వారిపై భూ ఆక్రమణ చట్టం మేరకు తీవ్ర చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

లొంగిపోకపోతే చర్యలు తప్పవు: ఏఎస్పీ



గ్రామంలో విచారిస్తున్న సెబ్ ఏఎస్పీ సుబ్బరాజు

గుడిపాల, మార్చి 31: సారా తయారీ, ఇతర కేసుల్లో ఉండి పోలీసులకు దొరకకుండా తిరుగుతున్న వారంతా వెంటనే లొంగిపోవాలని సెబ్ ఏఎస్పీ సుబ్బరాజు అన్నారు. ఆదివారం మండలంలోని రాసనపల్లెలో ఆయన విచారణ చేపట్టారు. గ్రామంలో పది మంది వరకు వివిధ కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్నారని, అలాంటి వారు చట్టాన్ని గౌరవించి లొంగిపోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీసులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో టీడీపీపై దుష్ప్రచారం తగదు

కార్వేటినగరం, మార్చి 31: రాష్ట్రంలో వలంటీర్ల చేత పింఛన్ల పంపిణీ చేయించకూడదని ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాలపై వైసీపీ ప్రభుత్వం టీడీపీపై దుష్ప్రచారం చేస్తుందని చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు ఎన్ నాగేశ్వరరాజు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసిన విషయాన్ని వివరించారు. వైసీపీ ప్రభుత్వం ఇప్పటికైనా టీడీపీపై వాస్తవ విరుద్ధ ప్రచారం చేయటం మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఎలక్షన్ కమిషన్ తీసుకున్న నిర్ణయానికి టీడీపీని తప్పు పట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

విద్యార్థిని అదృశ్యం

పుంగనూరు రూరల్, మార్చి 31: విద్యార్థి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ జానకీరామ్ తెలిపారు. పుంగనూరు ఎన్‌ఎస్‌పేటకు చెందిన ముక్తియార్ కుమార్తె(14) శనివారం ఉదయం స్నేహితురాలి వద్ద పుస్తకాలు తీసుకువస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి ముక్తియార్ ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

జగన్‌ను నమ్మిన క్రైస్తవులకు చేసిందేమీ లేదు

● గెలిపించినందుకు వారిపైనే దాడులు: గురజాల జగన్మోహన్



ఆనగల్లు చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న టీడీపీ నాయకులు

చిత్తూరు రూరల్, మార్చి 31: జగన్‌ను నమ్మి ఓటు వేసిన దళిత క్రైస్తవులకు ఆయన చేసిందేమీ లేదని, పైగా గెలిపించినందుకు వారిపైనే దాడులు.. ఇది వైసీపీ ప్రభుత్వం చేసిన ఘనకార్యమని చిత్తూరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ విమర్శించారు. ఆదివారం చిత్తూరు రూరల్ మండలంలోని ముట్టుకూరు, ఆనగల్లు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో నా ఎస్సీ, నా ఎస్టీ అని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ వారిపైనే దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంతో మంది దళితుల బలయ్యారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో దళితులందరూ కూటమి వైపే ఉన్నారని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వస్తే ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ తీసుకొస్తానని చెప్పి, నిరుద్యోగ యువతను దగా చేశారని అన్నారు. 2024లో కూటమి విజయం సాధించిన మొదటి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపైనేనని చంద్రబాబు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలంటే కూటమిని గెలిపించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ అసత్య వాగ్దానాలతో జగన్ అధికారంలో వచ్చారని, ఎన్నికల వేళ మళ్లీ ఆయన మాటలకు మోసపోయేందుకు ఎవరు సిద్ధంగా లేదని అన్నారు. ఈస్టర్ సందర్భంగా ఆనగల్లు చర్చిలో ప్రార్థనలో నాయకులు పాల్గొన్నారు. కూటమి అధికారంలోకి వస్తే క్రైస్తవుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని గురజాల అన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడు, మాజీ మేయర్ కఠారి హేమలత, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, మేషాక్, దయారాం, మురళీ కృష్ణ, నవీన్, కార్తీక్, మూర్తి, జగదీష్, హరిబాబు చౌదరి, మైకేల్, కరుణాకర్, దినకర్, చల్లా, రాజా, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండి ఉత్సవం



బండి ఉత్సవంలో పాల్గొన్న కళాకారులు, ఉత్సవ నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, మార్చి 31: నగరపాలక పరిధిలోని 21వ డివిజన్ కుక్కలపల్లె లక్ష్మయ్యకండ్రిగ దౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత నాలుగు రోజులుగా మహాభారత ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం బకాసురవధ (బండి ఉత్సవాన్ని) కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు శ్రీ వెంకటేశ్వర నాట్యకళామండలి కళాకారులచే బకాసురుడికి ముష్టాన్నాన్ని సేకరించి తీసుకురావడానికి ఎద్దుల బళ్లు, ట్రాక్టర్ల ద్వారా పూజలు చేసి బయలు దేరారు. ఉత్సవ నిర్వాహక ధర్మకర్త పూల సుబ్రమణ్యం నాయుడు, నిర్వాహకులు కుమారస్వామి నాయడులు బళ్లకు, ట్రాక్టర్లకు పూజలు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హరికథ కళాకారిణి సీతాలక్ష్మిచే హరికథ, రాత్రి 9 గంటల నుంచి నాటక ప్రదర్శన జరిగింది. బండి ఉత్సవం సందర్భంగా పరిసర గ్రామస్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆ ప్రాంతమంతా తిరునాళ్ళను తలపించింది. వారందరికీ ఉత్సవ నిర్వాహకులు సిద్దయ్య నాయుడు, హరిబాబు నాయుడు, కొల్లా రవి నాయుడు రామచంద్రయ్య, గోవిందయ్యలు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

నిరుపయోగంగా మారిన 'బృందావనం'




క్రిష్ణజిమ్మాపురంలో నిరుపయోగంగా ఉన్న బృందావనం

పాలసముద్రం, మార్చి 31: మండలంలోని క్రిష్ణజిమ్మాపురంలో నిర్మించిన బృందావనం గత రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంది. ఇక్కడ బృందావనం షెడ్డుపై ఉన్న రేకులను దొంగలు ఎత్తుకెళ్ళిపోయారు. ఈ చోరీ గురించి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. షెడ్డుకు పైకప్పు రేకులు లేకపోవడంతో చెత్త నుంచి ఎరువు తయారు చేయడాన్ని మానేశారు. షెడ్డుకు కొత్తగా రేకులు వేయాలంటే సుమారు రూ.లక్ష అవుతుందని, అన్ని నిధులు పంచాయతీలో లేవని సర్పంచ్ అంటున్నారు. చోరీకి గురైన రేకులను రికవరీ చేయడంలో పోలీసులు పట్టించుకోవడం మానేశారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బృందావనం నిరుపయోగంగా మారింది. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని బృందావనం షెడ్డుకు రేకులు వేసి చెత్త నుంచి సంపదను సృష్టించాలని ప్రజలు కోరుతున్నారు.

అలరించిన దుర్యోధన వధ

పూతలపట్టు, మార్చి 31: మండల పరిధిలోని బాటగంగమ్మ మిట్టూరు వద్ద గత పది రోజులుగా జరుగుతున్న మహాభారత యజ్ఞ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఇందులో భాగంగా భీముడు, దుర్యోధనుడి వేషధారణలో పాడిన పద్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. దుర్యోధనుడి ప్రతిమ మట్టి కోసం భక్తులు ఎగబడ్డారు.



పద్యాలు పాడుతున్న దుర్యోధన, భీముడి వేషధారులు

ఏఎస్ఐ వడివేలు సేవలు ఆదర్శనీయం



ఏఎస్ఐ వడివేలును సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి తదితరులు

చిత్తూరు, మార్చి 31: పోలీసు విభాగంలో ఏఎస్ఐగా పనిచేసిన వడివేలు సేవలు ఆదర్శనీయమని చిత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రాజామహల్‌లో జరిగిన వడివేలు పదవీ విరమణ సన్మాన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి ఏఎస్ఐ స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉదయ్‌కుమార్, రిటైర్డు పోలీసు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మురళి, సప్తకన్నికలమ్మ ఆలయ ధర్మకర్త దళవాయి శివకుమార్, 3వ డివిజన్ కార్పొరేటర్ దళవాయి సునీత, కుమారవేలుతో పాటు పలువురు పోలీసు అధికారులు, రిటైర్డు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నేతలు



గాలి భాను ప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కార్యకర్తలు

విజయపురం, మార్చి 31: మండలంలోని కోసలనగరంలో వైసీపీ నాయకులు సోమశేఖర్, హరికృష్ణ, అమరేంద్ర, శివయ్య, మునస్వామి వారి అనుచరులు సుమారు 15 మంది నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో ఆదివారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీలో కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు లేకపోవడంతో టీడీపీలో చేరామన్నారు. టీడీపీ విజయానికి కృషి చేస్తామని చెప్పారు. గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిధి ధనుంజయ యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కైలాసంయాదవ్, నాయకులు వసంతాసుధాకర్‌రాజు, బాలసుబ్రహ్మణ్యంరాజు, దశరథరాజు, బాషా, చిన్నబ్బ, శేఖర్, ధాము, లోకేష్, మునిభాస్కర్‌రాజు, హరిరాజు, శ్రీనివాసులు, వెంకటరాజు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ టీడీపీలోకి..!



టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చిట్టిబాబు నాయుడు

పాలసముద్రం, మార్చి 31: మండలంలోని క్రిష్ణజిమ్మాపురానికి చెందిన బాబు నాయుడు, వరాలు నాయుడు, బలిజ కండ్రిగకు చెందిన సుబ్రహ్మణ్యం ఆదివారం సాయంత్రం టీడీపీలో చేరారు. వీరంతా టీడీపీ వారే. కానీ, ఆదివారం బలిజకండ్రిగలోని ఓ మామిడితోటలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి, నేతలు స్థానికులకు విందు సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి స్థానిక టీడీపీ కార్యకర్తలనూ కొందరు నేతలు బలవంతంగా తీసుకెళ్లారు. అక్కడ వైసీపీ కండువాలు వేయించారు. ఈ క్రమంలో సాయంత్రం వీరిని టీడీపీ కార్యాలయానికి రప్పించి ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు నాయుడు కండువాలు కప్పి మళ్లీ పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నేతలు శేఖర్‌రాజు, కంఠం ప్రతాప్ నాయుడు, తంగరాజు, వాసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేదని షామియానా తొలగింపు

గంగవరం, మార్చి 31: మండలంలోని చిన్నూరులో వైసీపీ నాయకులు వేసిన షామియానాకు అనుమతి లేదని ఎంపీడీవో విద్యాసాగర్ తొలగించారు. ఆదివారం ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా స్థానిక నాయకులు చిన్నూరులోని రోడ్డుపై షామియానా వేసి మైకులు సిద్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో, సిబ్బంది చిన్నూరు గ్రామానికి చేరుకొని సభా ప్రాంగణం, షామియానాలు వేయాలంటే ముందుగా కచ్చితంగా అనుమతి పొంది ఉండాలన్నారు. షామియానా తొలగించాలని, లేకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించడంతో తొలగించేశారు.

శిథిలావస్థలో డీఎం పురం ఆరోగ్య ఉపకేంద్రం



కార్వేటినగరం, మార్చి 31: డీఎం పురం ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్ర భవనం శిథిలావస్థకు చేరింది. ఉపకేంద్రం పరిసరాలన్నీ కలుపు మొక్కలు ఏపుగా పెరిగిపోయి అధ్వాన స్థితిలో ఉన్నాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్న విషయాన్ని అధికారులూ పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జీజేఎంను గెలిపించండి



చలిచీమలపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గురజాల ప్రతిమ

గుడిపాల, మార్చి 31: ఈసారి ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు, ఎంపీ అభ్యర్థి ప్రసాదరావులను గెలిపించాలని గురజాల సతీమణి ప్రతిమ, మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు కోరారు. ఆదివారం మండలంలోని కమ్మతిమ్మాపల్లె, కుప్పిగానిపల్లెలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, నేతలు దీపశ్రీ, సుమతి, హరి, రఘునాధనాయుడు, శేఖర్, లీలా, నాగరాజ్, బలరామ్, చందు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

తవణంపల్లె, మార్చి 31: రాష్ట్రంలో టీడీపీ విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని దిగువమాఘం పంచాయతీ పరిధిలో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేసి, టీడీపీ విజయానికి కృషిచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మండల అధ్యక్షుడు గాలి దిలీప్, నేతలు వెంకటేష్‌చౌదరి, కోదండయ్య, సునీల్‌కుమార్, భాస్కర్ నాయుడు, కుమార్ నాయుడు, శరవణ, రఘు, భాస్కర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రామకుప్పం, మార్చి 31: రామకుప్పం ఏపీ ఆదర్శ పాఠశాలలో 2024-2025 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి కోరారు. ఏప్రిల్ 6లోగా ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ లేక సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 40సీట్లు చొప్పున ఉన్నాయని తెలిపారు.

కిరణ్ కుమార్ రెడ్డిని కలసిన టీడీపీ నాయకులు

సోమల, మార్చి 31: మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని ఆదివారం సోమల మండల టీడీపీ నాయకులు కలికిరిలో కలసి సంఘీభావం తెలిపారు. ఆయనను సన్మానించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు యధుశేఖర్ నాయుడు, తెలుగు రైతు సంఘ నాయకుడు సీఎం సురేశ్,మాజీ సర్పంచు శ్రీనివాసులు నాయుడు, బాబురావు, రషీద్, రఘు, మునిరెడ్డి, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కురబ జాతర

కుప్పం, మార్చి 31: కుప్పం పట్టణం కొత్తపేటలో వెలసిన సిద్ధేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం కురబ కులస్తులు జాతరను వైభవోపేతంగా జరుపుకొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు నెత్తిమీద కొబ్బరికాయలు పగులగొట్టించుకుని స్వామిపై తమ భక్తిని చాటుకున్నారు. కురబ కులస్తులు ఈ జాతరలో పాల్గొని స్వామివారి కృపకు బాధ్యులయ్యారు.